సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

SK1 one NEWS HD

# శ్రీ సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 826 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | మంగళవారం 16-06-2026

## పశ్చిమాసియాలో శాంతికి మార్గం



- అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ
- అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్టు ప్రకటన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్టు ప్రకటించిన ట్రంప్

ఢిల్లీ :

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం - మిగతా 2 లో

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం

- ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యమెందుకని ప్రశ్న
- రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందన్న పవన్ కల్యాణ్
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం జనసేన పనిచేస్తుందన్న పవన్




హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి

- 'కాక్‌రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై జైపూర్‌లో దాడి
- నీట్ లీక్, నిరుద్యోగంపై నిరసన తెలుపుతుండగా ఘటన
- కేంద్ర మంత్రి రాజీనామా డిమాండ్‌తో ఆందోళన
- అభిజీత్‌పై మూకదాడికి సంబంధించిన వీడియోలు వైరల్
- యువతలో ఈ పార్టీకి ఆన్‌లైన్‌లో భారీ మద్దతు



జైపూర్ :

యువతలో ఆన్‌లైన్‌లో సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ - మిగతా 2 లో

## 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

- బ్రిటన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం
- 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం విధించిన యూకే
- పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రతే లక్ష్యమన్న ప్రధాని కీర్ స్టార్మర్
- టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ సహా ప్రధాన ప్లాట్‌ఫామ్‌లకు వర్తించనున్న నిబంధనలు
- నిర్ణయాన్ని స్వాగతించిన స్వచ్ఛంద సంస్థలు - మిగతా 2 లో



## విజయవాడ ట్రాఫిక్ సిగ్నళ్లకు ఏఐ టెక్నాలజీ

- వెబ్, మొబైల్ ద్వారా నియంత్రణకు ఏర్పాట్లు
- నగరంలో పైలెట్ ప్రాజెక్టుకు మంచి స్పందన
- మొబైల్ నుంచే ట్రాఫిక్ సిగ్నల్ నియంత్రణ
- 17 కూడళ్లలో మొబైల్‌తో నియంత్రణ

అమరావతి :

విజయవాడ నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ట్రాఫిక్ పోలీసులు ఏఐ ఆధారిత సిగ్నల్ కంట్రోలర్లను ఏర్పాటు చేయనున్నారు. వెబ్ లేదా మొబైల్ యాప్ ద్వారా సిగ్నల్ లైట్లను నియంత్రించే ఈ వ్యవస్థను గత నెలలో రమేష్ ఆసుపత్రి కూడలిలో ప్రయోగాత్మకంగా అమలు చేయగా ఆశించిన ఫలితాలు లభించాయి. దీంతో నగరంలోని ఇతర కీలక కూడళ్లలో కూడా ఈ పరికరాలను నెలాఖరులోగా - మిగతా 2 లో

## వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ విధానం
- స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో నిర్వహించిన భేటీలో పాల్గొన్న సీఎం
- భూ సమీకరణ విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామని వివరించిన చంద్రబాబు
- భారత్ అతి పెద్ద ఆర్థికశక్తి అని స్పష్టం



అమరావతి :

స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సమావేశానికి సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు. ఇప్పుడు భారత్ నిద్రపోతున్న ప్రాంతం కాదు. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి అని సీఎం స్పష్టం చేశారు.ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందన్న సీఎం వివరించారు. - మిగతా 2 లో

## ఏపీ ప్రభుత్వంతో గూగుల్ జట్టు



- ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు నిర్ణయం
- గూగుల్‌తో కలిసి పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో భాగస్వామ్యానికి అంగీకారం

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతతో పాటు ఇతర కీలక రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, టెక్ దిగ్గజం గూగుల్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా ఇరుపక్షాల సమన్వయంతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నాడు గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి అంశాలలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరువురు నేతలు ప్రాథమిక అంగీకారానికి వచ్చారు.ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ మరియు డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని గూగుల్ ప్రతినిధులకు సీఎం విజ్ఞప్తి - మిగతా 2 లో



## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

- విద్యార్థులకు సీఎం రేవంత్ సందేశం
- వేసవి సెలవుల అనంతరం తెలంగాణలో పాఠశాలలు పునఃప్రారంభం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్కార్
- వారంలో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి మాల్ట్ పంపిణీ
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సందేశం
- రాష్ట్రవ్యాప్తంగా 1,269 పాఠశాలల్లో 1.44 లక్షల మందికి ప్రయోజనం

హైదరాబాద్ :

వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల - మిగతా 2 లో

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక




- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సాలార్‌జంగ్ మ్యూజియంకు 75 ఏళ్లు
- మ్యూజియం 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, డిప్యూటీ సీఎం
- మ్యూజియం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్న భట్టి విక్రమార్క
- ఈ నెల 21 వరకు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణ

హైదరాబాద్ :

హైదరాబాద్ నగర స్ఫూర్తికి, సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మ్యూజియం 75వ వార్షికోత్సవం, సాలార్‌జంగ్3, 137వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విభిన్న సంస్కృతులు, - మిగతా 2 లో

## హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు
- కిషన్‌రెడ్డి వల్లే మెట్రో సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బందులు
- హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే మెట్రో రైలు నిర్మాణం
- రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్ :

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే ఆలోచనతో గతంలో దేశంలోనే కీలకమైన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం గురించి చర్చ జరిగిందని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందుగా ఉన్నాయని పేర్కొన్నారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆక్రమిత కశ్మీర్ కల్లోలం

ఎప్పుడూ జమ్మూ, కశ్మీర్ గురించి అంతర్జాతీయ వేదికలపై గంభీరోపన్యాసాలిస్తూ, మానవ హక్కుల చాంపియన్‌గా తనను తాను చిత్రించుకునే పాకిస్తాన్ గత కొన్ని రోజులుగా ఆక్రమిత కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం సైన్యం కాల్పుల్లో 30 మంది మరణించారంటున్నా, వాస్తవ సంఖ్య అంతకుమించి ఉంటుందన్నది స్థానికులు చెప్పే మాట. మరో 200 మంది గాయపడ్డారు. వేలాదిమంది అరెస్టయ్యారు. ఈసారి సాగిన నిరసన ప్రదర్శన సాధారణమైంది కాదు. ముజఫరాబాద్ ప్రదర్శనలో అన్నివర్గాలకూ చెందిన లక్షన్నరమంది పాల్గొన్నారు.మతం పేరు చెప్పి, గతం పేరుచెప్పి ఎల్లకాలమూ జనాన్ని మభ్యపెట్టడం సాధ్యంకాదని పాక్ పాలకులకు ఈ నిరసనలు తెలియజెప్పాయి. తమ ప్రాంత నదుల్లో మంగళ డ్యామ్‌వంటి ప్రాజెక్టులు నిర్మించి,ఇక్కడ ఉత్పత్తయ్యే జలవిద్యుత్‌ను పంజాబ్ తదితర ప్రాంతాలకు తరలించుకుపోతూ, స్థానికులకు అరకొర సదుపాయాలు కల్పించటం విషయంలో రెండు దశాబ్దాల క్రితమే అసంతృప్తి పెల్లుబికింది. కానీ సంఘటితం కాకపోవటంవల్ల చల్లారిపోయాయి. 2023లో రావల్‌కోట్, ముజఫరాబాద్, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో స్థానిక సమస్యలపై కమిటీలు ఏర్పడి ఉద్యమించాయి. ప్రజల మౌలికాహారమైన గోధుమ పిండి ధర పెంచడాన్నిప్రశ్నించాయి. వీటిని ప్రభుత్వం బేఖాతరు చేసిన ఫలితంగా ఆ కమిటీ లు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జాక్)గా ఒక్కటయ్యాయి.ఆనకట్టల కారణంగా పలువురు నిర్వాసితులవుతున్నా, వలసపోతున్నా పట్టించు కునేవారు లేరు. పోనీ అని స్థానిక ప్రజలకైనా ఒరిగేదేమీ ఉండదు. మిలిటెన్సీ ఉందన్న పేరిట భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించటం ఒక్కటే వారికి కనబడేది. అందుకేశాంతియుత పద్ధతుల్లో పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహించటం, విద్యుత్ బిల్లుల చెల్లింపు నిలిపివేయటం, సంపూర్ణ బంద్, లాంగ్‌మార్చ్ వంటివి ఈ మూడేళ్లలో ఎన్నో జరిగాయి. సైన్యం పడగనీడలో కాలక్షేపం చేసే ప్రభుత్వానికుండే అధికారాలు అంతంత మాత్రం. ఏ జవాబుదారీతనమూ లేని సైన్యానిదే పెత్తనం. అందుకే ఆక్రమిత కశ్మీర్‌కు ఎదుగూ బొదుగూ లేదు. ఆ ప్రాంత వనరుల్ని కొల్లగొట్టడానికి పాక్ పాలకులు ఒక సృజనాత్మక విధానం కనుక్కున్నారు. 53 మందితో దానికొక అసెంబ్లీ ఉంది. ఆక్రమిత కశ్మీర్‌కు ముఖ్యమంత్రి కాదు... ప్రధాని ఉంటాడు. కానీ అధికారాలన్నీ ఇస్లామాబాద్‌లో కొలువుదీరిన సైనికాధికారుల ఆధిపత్యంవుండే కశ్మీర్ కౌన్సిల్ చేతిలో ఉంటాయి. ఈసారి కేవలంఆర్థిక సమస్యలపై మాత్రమే కాదు... అసెంబ్లీ అమరికపై కూడా డిమాండ్లు బయల్దేరాయి. మొత్తం 53 స్థానాలుండగా, 'శరణార్థుల'కు డజను కేటాయిస్తారు. మరో అయిదు మహిళలకూ... ఉలేమాలు, సాంకేతిక నిపుణులు, విదేశాల్లో స్థిరపడిన కశ్మీరీలకు ఒక్కొక్క స్థానం ఉంటాయి. ఈ ఖాతాలకింద పోయే 20 స్థానాలకూ ఎన్నికలు జరిగేదెక్కడో, నిర్వహించేదెవరో ఎవరికీ తెలియదు. వారు ఎన్నుకోవాల్సింది మాత్రం 33 మందిని.మళ్లీ ఇందులో అత్యధికులు పాక్ పాలకుల కనుసన్నల్లో నడిచేవారే ఉంటారు. చివరకు కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఉద్యమకారులు అడిగేదల్లా 'శరణార్థుల' డజను స్థానాలూ రద్దు చేయాలన్నదే. కానీ అలా చేస్తే స్థానికుల పెత్తనం పెరుగుతుందని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే జాక్ నాయకుల ఆచూకీ చెబితే 35,000 డాలర్లు బహుమతి ఇస్తామని ప్రకటించింది. వచ్చే నెల్లో ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ప్రాంత వనరుల దోపిడీ తప్ప, వారి ఆకాంక్షల్ని నెరవేర్చడం సాధ్యపడదని ఉద్యమాలను అణిచేయటం ద్వారా పాక్ చెబుతోంది. పాలకులు వలసవాద మనస్తత్వంతో ఆప్రాంతాన్ని చెరబట్టారు తప్ప, స్థానికుల డిమాండ్లపై ఖాతరు లేదు. ఉద్యమకారులు38 కోర్కెలు ప్రభుత్వం ముందుంచారు. డజను సీట్ల కోటా రద్దుతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయనాయకులకిస్తున్న ఖరీదైన కార్లు, ఉచిత విద్యుత్ తదితర రాయితీలు రద్దు చేసి, ఆ నిధులు జన సంక్షేమానికి వ్యయం చేయాలని కూడావారు కోరుతున్నారు. ఇలాగే మొండికేస్తూ పోతే ఆ ప్రాంత ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుందే తప్ప చల్లారదని పాకిస్తాన్ పాలకులు గ్రహించాలి.

## వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్

**మొదటిపేజీ తరువాయి -** కానీ భారత్‌కు అంత సమయం పట్టటం లేదని అన్నారు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు.భారత్‌ను నెంబర్ 1 చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఏపీలో పెట్టుబడుల విషయంలో ప్రధాని చొరవ కారణంగా ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీకి వచ్చాయని వివరించారు. హిందూ గ్రోత్ రేట్ 1 నుంచి 2 శాతం మాత్రమేఅని ఒకప్పుడు హేళన చేసేవాళ్లు ఇప్పుడు పరిస్థితి మారిందని, ఏ రంగంలో పెట్టుబడులకు అయినా భారతదేశం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పాలసీలు, సాంకేతిక నిపుణులు, అవసరమైన ఎకో సిస్టంతో ప్రధాని దేశాన్ని పెట్టబడులకు సిద్ధంగా ఉంచారన్నారు. ప్రస్తుతం 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉందని అన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో తాము వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే



విధానాన్ని అనుసరి స్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామన్నారు. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నామన్నారు. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు కేటాయించామని తెలిపారు. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయమన్న చంద్రబాబు, పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయన్నారు. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందని అన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు."శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశముంది. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.

## పశ్చిమాసియాలో శాంతికి మార్గం

**మొదటిపేజీ తరువాయి -** ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని



మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు.అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

## ఏపీ ప్రభుత్వంతో గూగుల్ జట్టు

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగానికి, 'సంజీవని' ప్రాజెక్టు అమలుకు సాంకేతిక భాగస్వామ్యం కావాలని కోరారు. అదేవిధంగా, రాష్ట్ర యువతకు ఏఐ, క్లౌడ్ టెక్నాలజీ రంగాలలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని చంద్రబాబు ఈ సందర్భంగా ప్రతిపాదించారు.తన పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి లాజిస్టిక్స్ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ అయి, రాష్ట్రంలో సప్లై చైన్ మరియు లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరరేఖ, పోర్టులు మరియు మెరుగైన కనెక్టివిటీ వంటి మౌలిక వసతులను వివరిస్తూ పెట్టుబడులకు ఆహ్వానించారు. మరోవైపు, యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తోనూ సమావేశమైన సీఎం, రాష్ట్రంలో 'యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు చొరవ చూపారు. పట్టణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కీలక సమావేశాల్లో ముఖ్యమంత్రితో పాటు మంత్రి నారాయణ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక

**మొదటిపేజీ తరువాయి -** విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సాలార్‌జంగ్ మ్యూజియం వివిధ సంస్కృతుల మధ్య సామరస్యానికి ప్రతీక అని, ఇది ఒక అపురూపమైన జాతీయ సంపద అని అభివర్ణించారు. జూన్ 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా మ్యూజియం విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.సాలార్‌జంగ్-3గా ప్రసిద్ధి చెందిన మీర్ యూసుఫ్ అలీ ఖాన్ ఒక్కరే సేకరించిన అరుదైన కళాఖండాలతో ఈ మ్యూజియం ఏర్పాటైంది. 1951లో మూసీ నది ఒడ్డున ప్రారంభమైన ఈ మ్యూజియం, నేడు దేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం

**మొదటిపేజీ తరువాయి -** పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు.యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## విజయవాడ ట్రాఫిక్ సిగ్నళ్లకు ఏఐ టెక్నాలజీ



**మొదటిపేజీ తరువాయి -** ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు.రమేష్ ఆసుపత్రి కూడలిలో అమలు చేసిన పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో బెంజి సర్కిల్, నిర్మలా జంక్షన్, మహానాడు, చల్లపల్లి బంగ్లా, పోలీసు కంట్రోల్ రూమ్, డీసీపీ బంగ్లా, ఆంజనేయస్వామి కూడలి, చుట్టుగుంట జంక్షన్, విజయా టాకీస్, శారదా కళాశాల కూడలి, సీతారాంపురం, సీతన్నపేట గేట్, పడవలరేవు, అప్సర, ఫుడ్ జంక్షన్, మధురానగర్ వంటి రద్దీ ప్రాంతాల్లో కూడా ఈ వ్యవస్థను విస్తరించనున్నారు.సిగ్నల్ స్తంభాలకు అమర్చే ప్రత్యేక పరికరాలు సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా ఏ సమయంలో ఏ రంగు సిగ్నల్ ఇవ్వాలో నియంత్రించగలుగుతారు. ప్రస్తుతం కొన్ని కూడళ్లలో సమయాలను ముందుగానే సెట్ చేసి సిగ్నళ్లను నిర్వహిస్తుండగా, కొత్త విధానంతో పరిస్థితులకు అనుగుణంగా వెంటనే మార్పులు చేయడం సాధ్యమవుతుంది.భవిష్యత్తులో కూడళ్ల వద్ద అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాహనాల రద్దీని ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కూడా పర్యవేక్షణ ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను క్షణాల్లో గుర్తించి సిగ్నల్ సమయాలను మార్చే అవకాశం ఉంటుంది.ఈ కంట్రోలర్లను భవిష్యత్తులో ఎడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్)తో అనుసంధానించనున్నారు. వాహనాల లెక్కింపు, నంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాల ద్వారా సేకరించే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని సిగ్నళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధానం అమలులోకి రానుంది. అయితే వాహనాల రద్దీని బట్టి సిగ్నళ్లను నియంత్రించడం వల్ల ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లు తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా సిగ్నల్ వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా ఉండటంతో ప్రయాణికుల సమయం ఆదా అవుతుంది. దానితో పాటు ట్రాఫిక్‌లో వాహనాలు నిలిచిపోయే సమయం తగ్గడంతో ఇంధన వినియోగం, వాయు కాలుష్యం తగ్గే అవకాశం ఉంది.

## హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

**మొదటిపేజీ తరువాయి -** ప్రతి ఏడాది రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ ఒప్పుకోలేదని వివరించారు.రూ.30 వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని, ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భాగస్వాములుగా ఉన్నారని, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్‌కు రూ.లక్షా 52 వేల కోట్లు అప్పుగా ఇచ్చారని, గతంలో కేసీఆర్‌కు ఆర్ఈసీ రూ.1.61 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిందని, ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.3.15 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చారని తెలిపారు.ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి 4 శాతం వడ్డీకి రూ.13,600 కోట్ల రుణం ఇప్పించామని సీఎ తెలిపారు. బ్యాంకుల అప్పులకు రేవంత్ రెడ్డికి తేలికగా పనిచేస్తే తెలంగాణలో బీజేపీకి ఇబ్బందులు వస్తాయని కిషన్‌రెడ్డియయ ఖట్టర్, అశ్వినీకి చెప్పారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఖట్టర్, అశ్వినీకి చెప్పాకే సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.గతంలో కిషన్‌రెడ్డిని కేసీఆర్ ఏమని తిట్టారో ప్రజలందరికీ తెలుసునని సీఎం తెలిపారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణ నిధులు ఇంకా ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హామీ ఇచ్చినా కూడా లోన్ డబ్బు ట్రాన్స్‌ఫర్ కాలేదని, ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు.



తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో ఉన్నది కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా అని నిలదీశారు. కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ కలిసి మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు.మెట్రో బదిలీని చాలా కష్టపడి ఒక కొలిక్కి తీసుకువచ్చామన్న రేవంత్ రెడ్డి.. ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మరి మెట్రో విస్తరణకు మాత్రం కేంద్రం ఎందుకు సహకరించట్లేదని నిలదీశారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు కేంద్రం వద్దే ఆగి ఉందని విమర్శించారు. ఇటీవల అన్ని రాష్ట్రాలకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌కు ఆపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌ను ఆపారని తెలిపారు. తెలంగాణపై కేంద్రం తీవ్రమైన వివక్ష కొనసాగిస్తోందని మండిపడ్డారు. మెట్రో అనుమతుల కోసం కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా అని అడిగారు. కిషన్‌రెడ్డి వెనుక ఎవరున్నారో తాను నేరుగా చెప్పట్లేదని అన్నారు. కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రి కాబట్టి ఆయనకే ఎక్కువ బాధ్యత ఉందని హితవు పలికారు.బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ప్రధాని మోదీ రాజీనామా చేస్తారా సీఎం నిలదీశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్ ప్రకటించారని, ఇంకా సాకారం కాలేదని తెలిపారు. అన్నింటికి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే తాము కూడా చేస్తామని ప్రకటించారు."ఫేస్-1 మెట్రోను మేము కొనుగోలు చేసుకుంటున్నాం. మా డబ్బులే కట్టుకుంటున్నాం. మా గ్యారంటీనే ఇచ్చాం. మా కర్మ బాగలేక ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పోరేషన్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ దగ్గర అప్పుకు మొత్తం ఒప్పందాలు, సంతాకాలు చేసుకున్నాం. నిధుల విడుదలకు ఈరోజు చివరి రోజు. మరి ఈరోజు విడుదల చేస్తావా చెయ్యవా కిషన్‌రెడ్డి. 5 గంటల వరకు బ్యాంక్ ఉంటుంది. ఇది మొదటిది. రెండవది ఫేస్-2 కి 122 కిలోమీటర్లకు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం తీసుకుంటదా తీసుకోదా ఒకవేళ తీసుకోకపోతే మాకు ఎల్ఓసీ ఇవ్వండి. హెచ్ఎమ్ఆర్ఎల్ నుంచి మేమే సేమ్ అదే ఐఆర్ఎఫ్ నుంచి సేమ్ లోన్ తెచ్చుకుని సేమ్ మెట్రో విస్తరించుకుని ప్రజలకు మెట్రోను అంకితం చేస్తాం. ఇంతకుమించి నాకు నీకు గట్టు పంచాయితీ ఏ పంచాయితీ లేదు. మీ పట్ల నాకు గౌరవం ఉంది" రేవంత్ రెడ్డి, సీఎం

## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి -** కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు.పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు."అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి

**మొదటిపేజీ తరువాయి -**


దీప్కేపై దాడి జరిగింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఒక్కసారిగా చెంపపై కొట్టడంతో దీప్కే ఆత్మరక్షణ కోసం ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది.నీట్ పేపర్ లీక్, దేశంలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం జరుగుతుండగానే అభిజీత్ దీప్కేపై ఈ దాడి జరిగింది. ఆందోళన చేస్తున్న అభిజీత్‌ను ఓ గుంపు అడ్డుకుని దాడికి పాల్పడింది. దాంతో, అభిజీత్ పై దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు చితకబాదారు.కొందరు యువతను 'బొద్దింకలు' అంటూ సీజేఐ చేసిన ఓ వివాదాస్పద వ్యాఖ్యకు వ్యంగ్యాస్త్రంగా, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న 30 ఏళ్ల అభిజీత్ దీప్కే మే నెలలో 'కాక్రోచ్ జనతా పార్టీ'ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ ఉద్యమం యువతను ఆకట్టుకుని ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. గతంలో ఢిల్లీ, పుణె నగరాల్లో నిరసనలు చేపట్టిన ఈ బృందం, జైపూర్‌లోనూ ఆందోళనకు పిలుపునిచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో నిరసన తెలుపుతుండగా ఆయనపై దాడి జరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

**మొదటిపేజీ తరువాయి -** బ్రిటన్‌లో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించాలని అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ప్రపంచంలో పిల్లల మానసిక ఆరోగ్యాన్ని, భద్రతను కాపాడటంతో పాటు వారికి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం ప్రకటించారు.డౌనింగ్ స్ట్రీట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, "మన పిల్లలను విఫలం చేస్తున్న వ్యవస్థకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైంది. ఈ నిర్ణయం ద్వారా పిల్లలకు వారి బాల్యాన్ని తిరిగి అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. టెక్ దిగ్గజాల ప్రభావం నుంచి చిన్నారులను రక్షిస్తూ, వారి సురక్షితమైన వాతావరణంలో ఎదిగేందుకు ఈ నిషేధం దోహదపడుతుందని ఆయన వివరించారు.ఇప్పటికే ఆస్ట్రేలియాలో అమలవుతున్న విధానం స్ఫూర్తితో ఈ నూతన పాలసీని తీసుకువస్తున్నారు. దీని ప్రకారం టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై 16 ఏళ్లలోపు వారికి ప్రవేశం ఉండదు. లైవ్ స్ట్రీమింగ్, అపరిచితులతో సంభాషించడం వంటి ఫీచర్లపై కూడా ఆంక్షలు అమలవుతాయి. ఈ నిర్ణయానికి ముందు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో దాదాపు 90 శాతం మంది తల్లిదండ్రులు ఈ నిషేధానికి మద్దతు తెలిపారు.ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. చిన్నారుల రక్షణలో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని ఎన్ఎస్‌పీసీసీ వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్ కంటెంట్ కారణంగా తన కుమార్తెను కోల్పోయిన ఎస్తర్ ఘే అనే తల్లి, ఈ నిషేధం ఎందరో పిల్లల ప్రాణాలను కాపాడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.అయితే, ఈ చట్టం అమలు తీరుపై నిపుణులు కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇటువంటి నిషేధం ఉన్నప్పటికీ, చాలామంది టీనేజర్లు వీపీఎన్ వంటి మార్గాల ద్వారా సోషల్ మీడియాను వినియోగిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ సవాళ్లను అంగీకరించిన ప్రధాని స్టార్మర్, సాంకేతిక అడ్డంకులను సాకుగా చూపి చర్యలు తీసుకోకుండా ఉండలేమని స్పష్టం చేశారు. కఠినమైన వయసు ధ్రువీకరణ వ్యవస్థలతో జులై నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# సీఎం సహాయ నిధి పేదలవరం





డోన్ టౌన్, జూన్ 15,(సీమ కిరణం న్యూస్): ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని డోన్ నియోజకవర్గంలో మరోసారి స్పష్టమైంది. గత రెండేళ్లలో నియోజకవర్గానికి చెందిన 653 మంది లబ్ధిదారులకు రూ.6.02 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందగా, సోమవారం మరో రూ.27.05 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. అనారోగ్య చికిత్సలు, ప్రమాదాలు, అత్యవసర వైద్య అవసరాలు మరియు ఇతర సంక్షేమ కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిచ్చిందని లబ్ధిదారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సలకు దూరమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలా మారిందన్నారు. గత రెండేళ్లలో డోన్ నియోజకవర్గానికి చెందిన 653 మందికి రూ.6,02,13,719 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేయడం ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు అవసర సమయంలో తమ సమస్యలను తెలియజేస్తే ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ సహాయం అందిస్తోందని చెప్పారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. డోన్ నియోజకవర్గ ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సేవలు అందించడమే తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు

తహసిల్దార్ భారతి



ప్యాపిలి జూన్ 15 (సీమ కిరణం న్యూస్) : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు వస్తాయని తహసిల్దార్ భారతి అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా పండించే ప్రకృతి వ్యవసాయ పద్ధతి రైతులకు, వినియోగదారులకు ఎంతో మేలు చేస్తుంది. భూమి సారవంతత పెరగడం, సాగు ఖర్చులు తగ్గడం, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన తాజా కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ను తహసిల్దార్ భారతి సందర్శించి కూరగాయల నాణ్యత, ధరలు, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించాలని, ప్రజలు ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు ఆదాయం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ఈఎఫ్ ఎంటి లు రామక్రిష్ణ, హరి, వెంకటేష్, ఐసి ఆర్పిలు,రామతీర్థం, ప్రభాకర్, దామోదర్, లలితమ్మ పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు ఇవ్వాలి

### ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

### తప్పకుండా పరిశీలిస్తామని కలెక్టర్ హామీ



కర్నూలు ప్రతినిధి, జూన్ 15, (సీమకిరణం న్యూస్) : ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వెంకట సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్ కలెక్టర్ ను కోరారు. జర్నలిస్టుల పిల్లలు 50 శాతం ఫీజు రాయితీ కోరుతూ.. సోమవారం కలెక్టర్ ఏ సిరి ని ఆమె ఛాంబర్ లో కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా మీడియా గుర్తింపు పొందినా.. అందులో పని చేసే జర్నలిస్టుల జీవితాలు మాత్రం అస్తవ్యస్థంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా నిత్యం జర్నలిస్టులు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చేయడం, ప్రజల సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిష్పాక్షికంగా ప్రజలకు తెలియజేయడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారన్నారు. అయితే మీడియాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులలో అధిక శాతం మంది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందినవారే అన్నారు. సమాజం పట్ల ఉన్న బాధ్యత, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలనే తపనతో ఎంతోమంది ఈ వృత్తిని ఎంచుకుంటున్నారని, అయితే పత్రికలు, టీవీ ఛానళ్ల యాజమాన్యాలు ఇచ్చే చాలీ చాలని వేతనాలు కుటుంబ పోషణకు కూడా సరిపోని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పిల్లలను కూడా చదివించుకోలేని దుస్థితి ఉందన్నారు. పేద పిల్లలకు ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. చివరకు జర్నలిస్టుల పిల్లలకు మొత్తం ఫీజులో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని అడిగినా అనేక అడ్డంకులు పెట్టి తిరస్కరిస్తున్నారని, కొంత మంది కోర్టులను కూడా ఆశ్రయించి కొర్రి వేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అన్నివర్గాల ప్రజల కోసం నిష్పక్షపాతంగా పని చేస్తున్న జర్నలిస్టుల పట్ల వివక్ష తగదన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లల పట్ల ఉదాశీనతతో వ్యవహరిస్తున్నా.. కర్నూలు జిల్లా లో మాత్రం కొంత మంది ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలు, అధికారులు శీతకన్ను ప్రదర్శించడం బాధాకరం అన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా ఎలాంటి ఇబ్బంది లేకుండా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ సర్క్యులర్ ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల విన్నపాన్ని అధికారులు, యాజమాన్యాలు మన్నించి అండగా నిలవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఏ సిరి అధికారులు, యాజమాన్యాలతో మాట్లాడి 50 శాతం ఫీజు రాయితీ ఇప్పించేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మంజు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాష్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్యవర్గ సభ్యులు మధు, నగర నాయకులు మల్లికార్జున, హరి కృష్ణ, రమేష్, వీడియో జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్నేహల్, సూరి, రమేష్ తదితరులు కలెక్టర్ ను కలసిన వారిలో ఉన్నారు.

## కావలి ఎడవల్లి పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



నెల్లూరు, ఆత్మకూరు, ఏఎస్ పేట, జూన్ (సీమ కిరణం న్యూస్) : ఏఎస్ పేట మండలం కావలి ఎడవల్లి గ్రామంలోని యం.పి.పి.ఎస్ మోడల్ ప్రైమరీ స్కూల్ , జి.సీ.పాఠశాలలోని చదివే విద్యార్థులకు విద్యా సామాగ్రిని దాతలు పంపిణి చేశారు ఈ మేరకు విరాళ దాతలు అయిన విద్యా కమిటీ చైర్మన్ కలికిరి. సునీల్ , వారి మిత్రులు గొడుగునూరు.బాబు, జల్లి.విష్ణు లు కలసి సుమారు 10 వేల రూపాయల విలువైన నోటుబుక్స్, కాపీ రైటింగ్, పెన్నులు ,పెన్సిల్, రబ్బర్ లు తదితర విద్య సామాగ్రిని పాఠశాలలో ఉన్న 62 మంది విద్యార్థులందరికి గ్రామ నాయకులు , జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఏలూరు.మాల్యాద్రి నాయుడు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు అలాగే పాఠశాల ఉపాధ్యాయులు ఎ. భాస్కర్ తన సొంత నిధులతో విద్యార్థులకు అట్టలు పంపిణీ చేశారు పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ కోసం కె. జ్యోత్స్న, ఉపాధ్యాయులు ఐతా .వెంకటేశ్వర్లు, ఎం. శ్రీనివాసులు, ఎ. భాస్కర్, ఆర్. వెంకటేశ్వర్లు, టి . సురేష్, బి. రవికుమార్ విరాళం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు సీతారామయ్య , మోహన్ గ్రామస్తులు పాల్గొన్నారు

## ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు





డోన్ టౌన్, జూన్ 15,(సీమ కిరణం న్యూస్): డోన్ షాదీఖానా లో ఈ రోజు ద్రోణాచలం సేవా సమితి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో తలసేమియా పేషెంట్ లకు సేవా సైనికులు మరియు డోన్ పరిసర ప్రాంత ప్రజలు తమ రక్తాన్ని ప్రభుత్వ రక్తనిధి కు మరియు కర్నూల్ బ్లడ్ బ్యాంక్ కు 35 యూనిట్లు రక్తం రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి షాదీఖానా ను ఉచితంగా సమకూర్చిన షాదీఖానా ప్రెసిడెంట్ దస్తగిరి కి సేవా సైనికులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు

### జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ సందర్శన

### ముఖ్యమంత్రి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

## జూన్ 24న ముఖ్యమంత్రి

# నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రాక





కర్నూలు ,(సీమకిరణం న్యూస్) :జూన్ 15 :- జూన్ 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారని ,పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరి లో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీని సందర్శించనున్నారని, ఈ పర్యటనకు కావలసిన ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు..సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్లాంట్ పరిశీలన, తదుపరి ప్లాంట్ సమీపంలో బహిరంగసభలో పాల్గొననున్నారని తెలిపారు.. హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పటి నుండి పబ్లిక్ మీటింగ్ ముగించుకుని తిరిగి విజయవాడ బయలుదేరేంతవరకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిపాడ్ , బహిరంగ సభ, బారికేడింగ్, రోడ్ల నిర్మాణం ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ శాఖల అధికారులను కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరంతర కరెంటు సరఫరా చర్యలు , త్రాగునీరు , టాయిలెట్స్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల ఎస్ ఈ లను ఆదేశించారు. మూడు ప్రదేశాలలో అంబులెన్స్ లతో ఉండాలని , లైవ్ బ్లడ్ డోనర్ , కార్డియో , న్యూరో స్పెషలిస్టులు , ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.పి జి ఆర్ ఎస్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎంప్లాయిమెంట్ అధికారిణి ని ఆదేశించారు. జలధార జలహారతి, డిఆర్డిఏ, అగ్రికల్చర్, హార్టికల్చర్ , స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర, ఆర్ అండ్ బి తదితర శాఖలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , డిఆర్ఓ వెంకట నారాయణమ్మ , ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి , జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి , జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డి ఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , డాక్టర్ భాస్కర్ , డి సి హెచ్ ఎస్ డాక్టర్ జఫరుల్లా , డ్వామా పిడి నరసింహరెడ్డి డిఇఓ నాగరాజు , ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి , ఆర్డీవో పత్తికొండ చిన్న ఓబులేసు,డిటిసి శాంతకుమారి, ఐసిడిఎస్ పిడి విజయ , ఎస్ జి ఎస్ డబ్ల్యు అధికారి భాస్కర్ నాయుడు , ఏడి హార్టికల్చర్ రాజ కృష్ణ రెడ్డి , ఈడి సోషల్ వెల్ఫేర్ తులసిదేవి , డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , జిల్లా పరిశ్రమల అధికారి అశోక్ కుమార్ , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , సి పి ఓ భారతి , దేవాదాయ శాఖ ఏసి సుధాకర్ రెడ్డి , డిడి మైన్స్ నాగిని , ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , డి పి ఓ భాస్కర్ , ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు, మొదలగు అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోట్ల చొరవతో బోర్ ఏర్పాటు

### - రెండవ వార్డ్ లో నీటి సమస్యకు పరిష్కారం



డోన్ టౌన్, జూన్ 15,(సీమ కిరణం న్యూస్): డోన్ పట్టణంలోని రెండో వార్డు రాఘవేంద్ర స్వామి గుడి వీధిలో గత కొన్ని సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి చొరవ తీసుకుని బోర్ ఏర్పాటు చేయించారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు సరోజ ఆధ్వర్యంలో బోర్ తవ్వకం పనులు చేపట్టడంతో స్థానికులకు తాగునీటి సమస్యకు ఉపశమనం లభించింది. బోర్ ఏర్పాటు పూర్తవడంతో కాలనీవాసులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా అధ్యక్షురాలు సరోజకు కూడా వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా

# నాణ్యమైన పరిష్కారాలు చూపాలి

### పీజీఆర్ఎస్ అర్జీలపై అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలి -- రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి

### పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, (సీమకిరణం న్యూస్) : జూన్ 15: ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించడంతో పాటు, తీసుకోబోయే చర్యలపై కూడా అర్జీదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలని సూచించారు.కారుణ్య నియామకాలకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని కారుణ్య నియామకాల కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, వాటిని 15 రోజుల్లోగా పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా పారదర్శకంగా, సమయపాలనతో వ్యవహరించాలని, పెండింగ్ కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొన్ని శాఖలు ఇంకా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదని పేర్కొంటూ, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, జిల్లాను రాష్ట్రంలో మంచి గణాంకాలు పొందే విధంగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఇంచార్జి మంత్రి కి ఘనస్వాగతం













(సీమకిరణం న్యూస్) : కర్నూలు జూన్ 15: జిల్లా పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు, రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గారిని స్టేట్ గెస్ట్ హౌస్ లో మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా గారు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు గారు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి గారు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ గారు,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ గారు

# ప్రజలకు కాంగ్రెస్ కరెంట్ షాక్




తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గవలసి వస్తుందని ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రజలను భయపెట్టారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ హయాంలో నిత్యం విద్యుత్ కోతలతో సతమతమయ్యారు. అనేక చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. ఎంతోమంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కార్ మొదట విద్యుత్‌రంగంపైనే దృష్టి సారించింది. ఈ క్రమంలోనే పదేండ్ల పాటు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సుపరిపాలనను అందించింది. అయితే, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా ఇప్పుడు ప్రజలకు కరెంట్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతుండటం ఆందోళనకరం. పరాయి పాలకుల హయాంలో కరెంటు సమస్యలతో అతలాకుతలమైన తెలంగాణ ప్రాంత ప్రజలు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఊపిరి పీల్చుకున్నా రు. కేసీఆర్ హయాంలో విద్యుత్‌రంగ స్వరూపమే మారిపోయింది. ప్రణాళికా బద్ధంగా కేసీఆర్ చేపట్టిన చర్యలతో విద్యు త్తు కోతలకు అడ్డుకట్ట పడింది. విద్యుత్తు ఉత్పాదనలో తెలంగాణ మిగులు రాష్ట్రం గా అవతరించింది. అయితే, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ఒక్కసారిగా విద్యుత్ సంక్షోభం తలెత్తింది. విద్యుత్ ఉత్పాదన, నిర్వహణా లోపాల కారణంగా కోతలు పునరావృతమవుతున్నాయి. అయితే, ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల పెం పుతో పెనుభారం మోపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధపడుతుండటం ఆందోళనకరం. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలు హామీలు అమలుచేయాలని ఒత్తిడి చేస్తుండటంతో వారిపై రకరకాల పన్నుల భారాన్ని మోపుతున్నది. తెలంగాణలోనే కాకుండా కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు దొడ్డిదారిన ప్రజలపై భారం మోపుతున్నాయి. గ్యారెంటీలను అమలుచేయలేక కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నాయి. ఒక ప్రణాళిక లేని పాలనతో తప్పటడుగులు వేస్తున్న కాంగ్రెస్ సర్కార్ విద్యుత్ చార్జీలు పెంచాలనే ప్రతిపాదనలను తెరపైకి తీసుకువచ్చింది. తద్వారా ప్రజలపై రూ.18, 500 కోట్ల మేర అదనపు భారం పడే అవ కాశాలున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.14,222 కోట్లు ఆదాయలోటు ఉన్నదని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలిలో పిటిషన్ దాఖలు చేశాయి. ఉత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్న కరెంట్‌కు, వినియోగదారులకు పంపిణీ చేస్తున్న కరెంటుకు మధ్య భారీ లోటు ఉన్నదని, దాన్ని పూడ్చేందుకుగాను చార్జీల పెంపునకు అవకాశమివ్వాలని ఈఆర్సీకి విన్నవించాయి. అయి తే, వాస్తవ రెవెన్యూ వ్యత్యాసం రూ.5,95 8 కోట్లు మాత్రమే ఉంటుందని ఎస్పీడీసీఎల్ అంచనా వేస్తుండటం గమనార్హం. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఇప్పటికే వ్యవసాయరంగం మొదలుకొని పారిశ్రామికరంగం వరకు అన్నిరంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ దశ లో విద్యుత్ చార్జీల పెంపు సరికాదని, ప్రతిపాదనలను తిరస్కరించాలని విద్యుత్ నియంత్రణ మండలికి బీఆర్ఎస్ విజ్ఞాప న పత్రం అందజేసింది. పారిశ్రామికరంగానికి సంబంధించి అన్ని క్యాటగిరీలకు ఒకేరకంగా చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అంతేకాదు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరవాలనే కుట్ర చేస్తున్నది. హైటెన్షన్ (హెచ్‌టీ) వినియోగదారులకు 11 కేవీ కనెక్షన్‌కు వసూలు చేస్తున్నట్టుగానే.. 33 కేవీ, 132 కేవీ కనెక్షన్లకు కూడా చార్జీలు వసూ లు చేయాలనే ప్రతిపాదనలున్నాయి. ప్రస్తుతం పరిశ్రమలకు సంబంధించి 11 కేవీ యూనిట్‌కు రూ.7.65, 33 కేవీకి రూ.7.15, 132 కేవీకి రూ.6.65 చొప్పు న డిస్కంలు వసూలు చేస్తున్నాయి. అయి తే, ఇకపై ఈ మూడు క్యాటగిరీలకు 11 కేవీ మాదిరిగానే యూనిట్‌కు రూ.7.65 చొప్పున వసూలు చేస్తే పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. పరిశ్రమలపైనే కాకుండా స్థిర చార్జీల పేరిట గృహ వినియోగదారులపై గుదిబండ మోపాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్న ది. ఇండ్లల్లో వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్ డ్ ఛార్జీ ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా.. దాన్ని రూ.50కి పెంచాలని డిస్కం లు కోరాయి. అంటే ప్రజలపై ఐదు రెట్ల భారం పడనున్నది. 200 యూనిట్లలోపు వాడే వినియోగదారులకు గృహజ్యోతి పేరి ట ఉచిత కరెంటు ఇస్తామని చెప్పిన కాం గ్రెస్ సర్కారు లబ్ధిదారుల సంఖ్యలో భారీ గా కోత పెట్టింది. గతంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కేసీఆర్ సర్కార్ ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని పడనీయలేదు. విద్యుత్ చార్జీలు పెంచాలని డిస్కంలు ప్రతిపాదనలు పంపినా కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించలేదు. అంతేకాదు, వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందించిన కేసీఆర్ సర్కార్ రూ.వేల కోట్ల భారాన్ని మోసింది. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను పదేండ్లలో మూడు రెట్లకు పైగా పెంచింది. విద్యుత్ రంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విప్లవాత్మక మార్పు ల కారణంగా రాష్ట్రంలో ఉపాధి అవకాశా లు పెరిగాయి. పారిశ్రామికంగా రాష్ట్రం కొత్త పుంతలు తొక్కింది. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తి డి చేసినా కేసీఆర్ సర్కార్ అంగీకరించలే దు. అయితే, ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి తెలపాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ నిలదీసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొహం చాటేశారు.

### విద్యుత్ చార్జీల పెంపునకు డిస్కంలు చూపుతున్న కారణాలు


సహేతుకంగా లేవని విద్యుత్‌రంగ నిపుణులు చెప్తున్నారు. విద్యుత్ ప్లాంట్లలో ఉత్పాదకత పడిపోతుండటంతో ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వస్తున్నది. అసమర్థ నిర్వహణ, అసంబద్ధ విధానాల ఫలితంగానే ఈ దుస్థితి తలెత్తుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారిశ్రామిక ప్రగతి మందగించిం ది. అందుకు విద్యుత్ సంక్షోభమే కార ణం. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా అనేక పరిశ్రమలు తరలిపోయాయి. డిస్కంలకు పరిశ్రమలే వెన్నెము క. కరెంటు చార్జీల పెంపుతో విద్యుత్ వ్యవ స్థ కుదేలవడంతో పాటు పారిశ్రామిక రం గం కూడా కుప్పకూలే ప్రమాదం ఉన్నది. పరిశ్రమలన్నింటినీ ఒకేగాటన కట్టే ప్రయ త్నం చేస్తుండటం కుటీర, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల పాలిట శాపంగా మార నున్నది. ఒకవేళ విద్యుత్ నియంత్రణ మండలి చార్జీల పెంపు ప్రతిపాదనలను ఆమోదిస్తే తెలంగాణలో మళ్లీ 2014 ముందున్న సంక్షోభ పరిస్థితులు తలెత్తుతాయి. విద్యు త్ కోతలు, చార్జీల పెంపు అంటే 'బంగారు తెలంగాణ'ను మరోసారి అంధకారంలోకి నెట్టివేయడమే. అసలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యుత్‌రంగంపై స్పష్టమైన విధానమంటూ ఏదీ లేదు. విద్యుత్ సమస్యల పై ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంబించడమే అందుకు తార్కాణం. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల విషయంటలో ఒంటెత్తు పోకడలకు పోయిన టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. 2000లో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీ లు పెంచి జలియన్ వాలాబాగ్ తరహాలో బషీర్‌బాగ్‌లో ఉద్యమకారులపై కాల్పులు జరిపింది. అప్పుడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ చార్జీల పెంపును తీవ్రంగా నిరసించారు. బాబు నిర్ణయాలతో ఏకీభవించని కేసీఆర్ అన్ని పదవులకు రాజీనామా చేసి టీడీపీ నుంచి బయటకు వచ్చారు. విద్యుత్ చార్జీల పెంపు విషయంలో ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురవడం తప్పదు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తుంది. అందుకే, ప్రజలపై పెనుభారం మోపే చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి.

# తైవాన్‌కు ఆయుధాలు విక్రయించేందుకు అమెరికా అంగీకారం తీవ్రంగా ఖండించిన చైనా



చైనా-తైవాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో తైవాన్‌కు 200 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి అమెరికా అంగీకరించింది. ఈ ఒప్పందాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. వీటిని తక్షణం నిలిపివేయాలని కోరింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. తైవాన్‌కు అమెరికా ఆయుధాలు విక్రయించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొంది. 'తైవాన్‌కు అమెరికా ఆయుధాలు విక్రయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలి. తైవాన్ జలసంధిలో శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదకరమైన చర్యలను వెంటనే ఆపాలి. చైనా తన జాతీయ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటుంది' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొన్నది. మరోవైపు ఆయుధాల విక్రయంపై తైవాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సైతం స్పందించింది. చైనా బెదిరింపుల నేపథ్యంలో మాతృభూమిని రక్షించుకునే బాధ్యత తమకు ఉందని వెల్లడించింది. కాగా తైవాన్ తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటి నుంచో వాదిస్తోంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల తమ దేశం చుట్టూ 153 చైనా సైనిక విమానాలు చక్కర్లు కొట్టినట్లు తైవాన్ రక్షణశాఖ వెల్లడించింది. అంతేగాక యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తన దళాలకు పిలుపునిచ్చినట్లు ఆ దేశానికి చెందిన మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో తైవాన్‌కు 200 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి అమెరికా అంగీకారం తెలిపింది. ఈ ఒప్పందం చైనాకు మింగుడు పడటంలేదు.

# కార్డియాక్ అరెస్ట్ వచ్చేందుకు నెల రోజుల ముందే ఈ లక్షణాలు కనిపిస్తాయి జాగ్రత్త పడండి



ప్రస్తుత తరుణంలో చాలా మంది కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోతున్న విషయం తెలిసిందే. కార్డియాక్ అరెస్ట్ అంటే గుండె పోటు అని అనుకుంటారు. అది నిజమే కానీ ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. కార్డియాక్ అరెస్ట్ అంటే గుండెకు ప్రసారం అయ్యే పంపింగ్ వ్యవస్థ పనిచేయదు. ఇది జరిగిన మరుక్షణమే గుండె ఆగి మరణిస్తారు. ఇది హార్ట్ ఎటాక్ కు కాస్త భిన్నమైంది. ఇది చాలా ప్రమాదకరమైంది. ప్రస్తుతం చాలా మంది కార్డియాక్ అరెస్ట్ బారిన పడి వెంటనే చనిపోతున్నారు. అయితే ఇందుకు కారణాలు ఏమున్నప్పటికీ కార్డియాక్ అరెస్ట్ వచ్చేందుకు నెల రోజుల ముందే పలు లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

### తీవ్రమైన అలసట, నీరసం..

కార్డియాక్ అరెస్ట్ వచ్చేందుకు నెల రోజుల ముందే మనకు పలు సంకేతాలను శరీరం తెలియజేస్తుందట. వాటిని పసిగట్టడం ద్వారా జాగ్రత్త పడవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. కార్డియాక్ అరెస్ట్ వచ్చే ముందు తీవ్రమైన అలసటగా, నీరసంగా ఉంటుంది. చిన్న పని చేసినా చాలు తీవ్రంగా అలసిపోతారు. విపరీతమైన నీరసం ఉంటుంది. ఏమాత్రం చురుగ్గా ఉండరు. యాక్టివ్‌గా పనిచేయలేకపోతుంటారు. అడుగు తీసి అడుగు వేయడం కష్టమవుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తున్నాయంటే మాత్రం దాన్ని కార్డియాక్ అరెస్ట్‌గా భావించాలి. వెంటనే డాక్టర్ ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి.


### శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది..

కార్డియాక్ అరెస్ట్ వచ్చే ముందు శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బంది అవుతుంది. ఛాతిపై ఏదో బరువు పెట్టినట్లు అనిపిస్తుంది. శ్వాస ఆడడం కష్టంగా మారుతుంది. అదేవిధంగా ఛాతిలో అసౌకర్యంగా ఉంటుంది. ఇక గుండె కూడా అసాధారణ రీతిలో కొట్టుకుంటుంది. గుండె కొట్టుకునే వేగం బాగా పెరుగుతూ తగ్గుతూ ఉంటుంది. అలాగే పాదాలు, చేతుల్లో వాపులు కనిపిస్తాయి. అక్కడంతా నీరు చేరుతుంది. వేలితో టచ్ చేస్తే చర్మం లోపలికి పోతుంది. ఇలా గనుక ఎవరిలో అయినా లక్షణాలు కనిపిస్తుంటే వారికి కార్డియాక్ అరెస్ట్ రాబోతుందని తెలుసుకోవాలి. దీంతో వెంటనే జాగ్రత్త పడాలి. డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే టెస్టుల్లో తేలిపోతుంది. దీంతో డాక్టర్ సూచన మేరకు చికిత్స తీసుకుని ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇక గుండె పోటు వచ్చే ముందు కూడా దాదాపుగా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. కాకపోతే గుండెపోటును కాస్త భిన్నంగా వైద్యులు చెబుతారు.

### గుండె పోటు వేరే..

రక్తనాళాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడితే గుండె పోటు వస్తుంది. గుండె పోటు వచ్చిన వారిని మొదటి గంటలో జాగ్రత్తగా చూసుకుంటే వారు బతికే అవకాశాలు ఉంటాయి. కానీ కార్డియాక్ అరెస్ట్ అలా కాదు. ఇది వచ్చిందంటే మరణించాల్సిందే. కాబట్టి పైన తెలిపిన లక్షణాల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండండి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోండి. లేదంటే తరువాత బాధపడినా ప్రయోజనం ఉండదు.

# రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీళ్లను తాగాల్సిందే ఎందుకంటే



అధిక బరువును తగ్గించుకోవడం అన్నది ఎంత కష్టంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. బరువు పెరగడం సులభమే. కానీ దాన్ని తగ్గించుకోవడం చాలా కష్టం. ఇందుకు గాను స్ట్రిక్ట్ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. చిరు తిండి తినాలనే యావను తగ్గించుకోవాలి. ఆహారం తక్కువగా తినాలి. రోజూ వ్యాయామం చేయాలి. ఇలా పలు కఠిన నియమాలను పాటిస్తే గానీ బరువు తగ్గరు. అయితే దీంతోపాటు బరువును తగ్గించుకోవడంలో నీళ్లు కూడా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. చాలా మంది బరువు తగ్గేందుకు కావల్సిన అన్ని మార్గాలను పాటిస్తారు. కానీ నీళ్లను సరిగ్గా తాగరు. వాస్తవానికి బరువును తగ్గించుకునేందుకు నీళ్లు కూడా ముఖ్య పాత్రను పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### మెటబాలిజం పెరుగుతుంది..

రోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీళ్లను అయినా తాగాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నీళ్లను సరిగ్గా తాగితేనే ఎన్ని వ్యాయామాలు చేసినా, డైట్‌ను పాటించినా ఫలితం ఉంటుందని వారంటున్నారు. నీళ్లను సరిగ్గా తాగకుండా ఏం చేసినా వృథాయేనని బరువు అంతగా తగ్గరని వారు చెబుతున్నారు. కాబట్టి రోజూ తగినన్ని నీళ్లను తాగాల్సి ఉంటుంది. నీళ్లను రోజూ తగినన్ని తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. అకాడమి ఆఫ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ అనే జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం రోజూ తగనన్ని నీళ్లను తాగడం వల్ల శరీర మెటబాలిజాన్ని పెంచుకోవచ్చని తేలింది. కనుక రోజూ తగినన్ని నీళ్లను తాగాల్సి ఉంటుంది.


### కొవ్వు కరుగుతుంది..

నీళ్లను రోజూ తగినన్ని తాగడం వల్ల శరీరంలో చేరే క్యాలరీలు కూడా తగ్గుతాయని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఒబెసిటీలో వెల్లడించారు. కాబట్టి రోజూ తగినన్ని నీళ్లను తాగితే బరువు తగ్గడం తేలికవుతుంది. నీళ్లను తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది కూడా బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. నీళ్లను సరిగ్గా తాగితే శరీరం కొవ్వును మరింత సమర్థవంతంగా కరిగిస్తుంది. ఈ విషయాన్ని క్లినికల్ ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం అనే జర్నల్‌లో ప్రచురించారు.

### జీర్ణవ్యవస్థకు మంచిది..

నీళ్లను సరిగ్గా తాగడం వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో సుఖ విరేచనం అవుతుంది. మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఇలా జరిగితే బరువు తగ్గడం తేలికవుతుందని క్లినికల్ న్యూట్రిషన్ అనే జర్నల్‌లో వివరాలను ప్రచురించారు. కనుక ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నీళ్లను సరిగ్గా తాగాల్సి ఉంటుంది. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీళ్లను అయినా సరే తాగాలని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయం నిద్ర లేవగానే కనీసం 1 లీటర్ వరకు నీళ్లను తాగినట్లయితే రోజులో కావల్సిన నీళ్ల కోటాలో దాదాపుగా 25 శాతం పూర్తవుతుంది. మిగిలిన కోటాను రోజులో చాలా సులభంగా పూర్తి చేయవచ్చు. కాబట్టి బరువు తగ్గాలని చూస్తున్న వారు నీటి విషయంలో కూడా జాగ్రత్తలు పాటించడం మంచిది. లేదంటే ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గలేరు. కనుక నీళ్లను రోజూ తప్పనిసరిగా తగినన్ని తాగాల్సి ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

# ప్రశ్నించే హక్కునూ కాలరాస్తరా



ముఖ్యమంత్రి రేవంత్ కార్యాలయంలో మూసీ నది సుందరీకరణ కోసం ఓ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'మెయిన్‌హార్ట్' అనే సంస్థ పాల్గొన్నది. ఈ సమావేశ అనంతరం మూసీ నది సుందరీకరణ కోసం మెయిన్‌హార్ట్ సంస్థ ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి కార్యాలయం మీడియాకు ప్రకటించింది. అయితే, రాష్ట్ర ప్రజానీకం గమనించవలసిన ముఖ్య విషయం ఏమంటే%ౌ% 2024, జనవరి 22 నాడే మెయిన్‌హార్ట్ సంస్థతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబాయ్‌లో పర్యటించారు. ఒక ప్రైవేట్ కంపెనీకి ఎలాంటి కాంట్రాక్టులు దక్కకముందే, ఎలాంటి సమావేశాలు జరగకముందే రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ఆ ప్రైవేట్ కంపెనీ యజమానితో కలిసి విదేశీ పర్యటన చేయడం ఆశ్చర్యకరం. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ కోసం, కన్సల్టెంట్ సర్వీసుల ఎంపిక ప్రక్రియ కోసం నిర్వహించిన టెండర్లపై నాకే కాదు, రాష్ట్ర ప్రజలకు కూడా ఎన్నో సందేహాలు కలుగుతున్నాయి. ఈ టెండర్ ప్రక్రియను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే, కావాలనే 'మెయిన్‌హార్ట్' కంపెనీకి అప్పగించినట్టు అర్థమవుతున్నది. రాజకీయ నాయకుల జోక్యం కారణంగానే రేవంత్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను ఉల్లంఘించిందనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది. అందుకోసమే ప్రాజెక్టు వ్యయం రూ.50,000 కోట్ల నుంచి ఏకంగా రూ.1.50 లక్షల కోట్లకు పెరిగిందనే చర్చ రాష్ట్రంలో జరుగుతున్నది. అంతేకాదు, ముఖ్యమంత్రి రేవంత్ కూడా పదే పదే 'మెయిన్ హార్ట్' సంస్థ తరఫున ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఈ కంపెనీని తానే ఎంపిక చేసినట్టు చెప్పడం కూడా టెండర్ నిబంధనలను ఉల్లంఘించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం మూసీ నదిని సుందరీకరణ చేయబోతున్నదని ప్రకటించారు. ఆ తర్వాతనే ఎంఆర్‌డీసీఎల్ అధికారులు మూసీ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ కోసం కంపెనీల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం ఆసక్తి గల కంపెనీల నుంచి ఫిబ్రవరి 5న టెండర్లను ఆహ్వానించింది. ఇందులో 10 కంపెనీలు బిడ్లు దాఖలు చేయగా, వాటితో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించారు. తర్వాత టెండర్ల విషయంలో ఏడు కంపెనీలకు మాత్రమే టెక్నికల్‌గా అర్హత ఉన్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత ఏప్రిల్ 10న రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి, జూన్ 24ను ఆఖరి తేదీగా నిర్ణయించింది. అయితే, అర్హులైన ఏడు కంపెనీల్లో ఐదు కంపెనీలు మాత్రమే స్పందించి ఆర్ఎఫ్‌పీలను సమర్పించాయి. వాటిలో ఎస్ఏఐ కన్సల్టెన్సీ కంపెనీ అతి తక్కువకు బిడ్డింగ్ చేసింది. అయినప్పటికీ ఆరు నెలల తర్వాత సాంకేతిక కారణాలను ఉటంకిస్తూ, ఇతర వివరణలేవీ ఇవ్వకుండానే ఆర్ఎఫ్‌పీలను ఎంఆర్‌డీసీఎల్ రద్దుచేసింది. ఎంఆర్‌డీసీఎల్ రద్దుచేసిన ఈ తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ టెండర్‌లో సాయి కన్సల్టెన్సీ రూ.60 కోట్లకు అతితక్కువగా బిడ్ చేసిన కంపెనీ. ఆ తర్వాత వారం రోజులకు ముందే ప్రభుత్వం మరోసారి ఆర్ఎఫ్‌పీలను ఆహ్వానించింది. కానీ, ఆ సమయానికి కేవలం ఎల్ఈఏ అసోసియేట్స్, మెయిన్‌హార్ట్ కంపెనీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో ఎల్ఈఏ కంపెనీ రూ.141 కోట్లకు బిడ్ దాఖలు చేయగా, మెయిన్‌హార్ట్ కంపెనీ రూ.143 కోట్లకు బిడ్ దాఖలు చేసింది. ఈ లెక్క ప్రకారం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ఎల్ఈఏ కంపెనీకే ఎంఆర్‌డీసీఎల్ అధికారులు అప్పగించాల్సి ఉన్నది. కానీ, వారం రోజుల తర్వాత సాంకేతిక కారణాలను చూపుతూ ఎల్ఈఏ కంపెనీని తిరస్కరించినట్టు మెయిన్‌హార్ట్ మాత్రమే పోటీలో మిగిలిందని ప్రభుత్వం చెప్పింది. ఆ తర్వాత రూ.141 కోట్ల బిడ్‌తో 'మెయిన్‌హార్ట్'ను ఎల్-1గా ప్రకటించారు. ఈ మూడు అంశాల నేపథ్యంలోనే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు- మెయిన్‌హార్ట్ సంస్థ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమయ్యాయి. అందుకే, రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టు డీపీఆర్‌ను అందించగలిగే అనేక సంస్థలను ఆకర్షించడంలో ప్రభుత్వం ఎందుకు ఫెయిల్ అయింది? ఈ టెండర్లలో అధిక సంఖ్యలో కంపెనీలు పాల్గొనేలా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? వంటి అనుమానాలు ప్రజల్లో సహజంగానే తలెత్తుతున్నాయి, తలెత్తాయి కూడా. అందుకే, ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రాపర్టీ మేనేజ్‌మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వచ్చాయి. అయితే, పలు సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులు తొలగించి, క్షమాపణలు చెప్పాలని 'మెయిన్‌హార్ట్' సంస్థ నాకు లీగల్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. సదరు సంస్థ పంపిన లీగల్ నోటీసుల్లోనే తనపై ఉన్న ఆరోపణలను ఒప్పుకున్నది. అయితే ఈ సందర్భంగా మెయిన్‌హార్ట్ కంపెనీ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకోవాల్సిన అవసరం ఉన్నది. పాకిస్థాన్‌లో జరిగిన రెండు భారీ కుంభకోణాలకు, మెయిన్‌హార్ట్ కంపెనీకి సంబంధాలున్నాయి. రావీ రివర్ ఫ్రంట్ కాంట్రాక్టులో లాహోర్ డెవలప్‌మెంట్ అథారిటీ వాళ్లు మెయిన్‌హార్ట్ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వాటిలో ఒకటి కాగా, ఇండ్ల నిర్మాణానికి సంబంధించి జరిగిన రూ.3,000 కోట్ల కుంభకోణంలో ఈ కంపెనీకి ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడం రెండ వది. కంపెనీ యజమానులు పరారీలో ఉన్న ట్లు ఆ నోటీసులో పేర్కొనడం గమనార్హం. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా కోర్టు పత్రాల రూపంలో ఉన్నాయి. అంతేకాకుండా, పాట్నా విమానాశ్రయంలో మెయిన్ హార్ట్ కంపెనీ అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా సదరు కంపెనీని బ్లాక్‌లిస్టులో పెట్టింది. వీటికి సంబంధించి ఆర్టీఐ ద్వారా బయటికి వచ్చిన సమాచారం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వాళ్లు కోర్టుకు సమర్పించిన పత్రాలు కూడా ఉన్నాయి. ఝార?ండ్‌లో కాంగ్రెస్, జేఎంఎం పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం ఉన్నది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ఇండియా కూటమిలో భాగస్వామి. అయినప్పటికీ హేమంత్ సోరేన్ కూడా మెయిన్‌హార్ట్‌పై సీబీఐ విచారణ కోరారు. అంతేకాదు, ఝార?ండ్‌లో కూడా మెయిన్‌హార్ట్ సంస్థ బ్లాక్‌లిస్ట్‌లో ఉండటం గమనించాల్సిన విషయం. ఒక బాధ్యత గల తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్‌లో నేను సోషల్ మీడియా కన్వీనర్‌గా కొనసాగుతున్నాను. మా పార్టీ తరఫున టీవీ చర్చల్లోనూ పాల్గొంటాను. అంతేకాదు, ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధన విద్యార్థిగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే తప్పుడు నిర్ణయాలను విశ్లేషించి ప్రశ్నించే హక్కును ప్రజాస్వామ్యం నాకు కల్పించింది. మూసీ నది సుందరీకరణ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చవుతాయని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. ఆయన రాజకీయ బృందాలను వెంటపెట్టుకొని తెలంగాణ ప్రజల సొమ్ముతో దుబాయ్, లండన్, సియోల్ లాంటి నగరాల్లో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే ఎలాంటి డీపీఆర్, డిజైన్ లేకుండానే పేద ప్రజల ఇండ్లను కూల్చివేస్తున్నది. ఒక రాష్ట్ర పౌరునిగా ఇందుకు సంబంధించిన ఏ అంశంలోనైనా ప్రభుత్వాన్ని, ప్రాజెక్టును చేపట్టిన మెయిన్‌హార్ట్ సంస్థను ప్రశ్నించే హక్కు నాకున్నది. అది నా బాధ్యత కూడా. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అనేది రాష్ట్రానికి సంబంధించిన అంశం. అలాంటి కాంట్రాక్టును ఇప్పటికే రకరకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న 'మెయిన్‌హార్ట్' సంస్థ దక్కించుకోవడం నన్ను విస్మయానికి గురిచేసింది. అందుకే సదరు కంపెనీకి సంబంధించిన గత చరిత్రను ప్రజలకు చెప్పదలచుకున్నాను. అందులో భాగంగానే ఈ తతంగాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాను. అందుకే, రాష్ట్ర ప్రభుత్వం కేసులని, లీగల్ నోటీసులని నన్ను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నది. తెలంగాణ ఉద్యమంలోనే ఎన్నో కేసులను ఎదుర్కొన్న నన్ను ఇలాంటి కేసులు ఎలాంటి భయానికి గురిచేయవు. అలాచేయడం కూడా ఈ ప్రభుత్వానికి సరికాదు. ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. తెలంగాణ ప్రజల తరఫున, మూసీ నది పరీవాహక ప్రాంతంలో నివసించే స్థానికుల పక్షాన ఎంతటి న్యాయ పోరాటానికైనా నేను సిద్ధం.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com